# సింహాచలం టెంపుల్లో సమన్వయ సమావేశం





- సింహాచలం చందనోత్సవానికి ఏర్పాట్లు వేగవంతం
- వివిధ శాఖల అధికారులతో ఈవో జె. వెంకటరావు సమావేశం

**సింహాచలం, పెన్ పవర్, మార్చి 5 :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింహాచలం టెంపుల్లో ఏప్రిల్ 20న జరగనున్న చందనోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లను వేగవంతం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఆలయ కార్యనిర్వహణాధికారి జె.వెంకటరావు ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో కీలక సమన్వయ సమావేశం జరిగింది. ఉదయం జరిగిన ఈ సమావేశంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ఉత్సవం సందర్భంగా పెద్ద సంఖ్యలో వచ్చే భక్తుల రద్దీని సమర్థంగా నిర్వహించడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, ఆరోగ్య సేవలు, అగ్నిమాపక భద్రత, పారిశుద్ధ్యం, ఇంజనీరింగ్ పనులు వంటి విభాగాల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయాలని ఈవో అధికారులకు సూచించారు.

ఈ సమావేశంలో ఈసౌత్ ఏసీపీ శ్రీనివాసు, గోపాలపట్నం సీఐ సన్యాసినాయుడు, ట్రాఫిక్ సీఐ సురేష్, హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారి రామిరెడ్డి, ఫైర్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధులు, జీవీఎంసీ అధికారులు, డెప్యూటీ ఈవో సింగం రాధ, ఇంజనీరింగ్ విభాగ అధికారులు, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారులు, పర్యవేక్షణ సిబ్బంది పాల్గొన్నారు. అదే రోజు మధ్యాహ్నం 12:30 గంటలకు కొండ దిగువన ఉన్న పరిపాలనా భవనంలో స్వచ్ఛంద సేవకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. చందనోత్సవం రోజున భక్తులకు ఫ్రూట్స్, బిస్కెట్లు పంపిణీ చేయడం వంటి సేవా కార్యక్రమాల నిర్వహణపై వారికి మార్గనిర్దేశం చేశారు.

తరువాత మధ్యాహ్నం 3:30 గంటలకు మరోసారి స్వచ్ఛంద సేవ కార్యకర్తలతో సమావేశమై దేవస్థానంలో సేవలు అందించే సమయంలో పాటించాల్సిన నియమాలు, భక్తులకు అందించాల్సిన సహాయంపై వివరణ ఇచ్చారు. సేవా కార్యక్రమాలు క్రమబద్ధంగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు చేసి భవిష్యత్ కార్యాచరణను వివరించారు.

ఈ సందర్భంగా ఈవో జె.వెంకటరావు మాట్లాడుతూ చందనోత్సవానికి భారీగా భక్తులు తరలివచ్చే అవకాశమున్నందున అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.


02

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

శుభాకాంక్షలు యాడ్స్

కేవలం

యాడ్ 300/-

'పోస్టుకార్డు సైజు '

'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి


## రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన పోలీసులు



**గరివిడి పెన్ పవర్ మార్చి 05.** చీపురుపల్లి పోలీస్ సర్కిల్ పరిధిలో గల గరివిడి పోలీస్ స్టేషన్ ఆవరణలో మహిళా సాధికార వారోత్సవాలలో భాగంగా సీఐ శంకర్రావు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని అందరూ రక్తదానంలో పాల్గొని ప్రాణదాతలు కావాలని ఆయన పిలుపునిచ్చారు. రక్తదానం చేయడం వలన ఎటువంటి అనారోగ్య సమస్యలు రావు అని రక్తదానం విషయం ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని ఆయన తెలియజేశారు. మనం చేసే రక్తదానం ఆపద సమయాల్లో ఇతరుల ప్రాణాలు నిలబెడుతుందని ఆయన తెలియజేశారు. అనంతరం రక్తదాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో గరివిడి ఎస్ఐ లోకేశ్వరరావు మానవీయత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు గోవిందరాజులు మరియు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.ం

## గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడికి 10 ఏళ్ల జైలు శిక్ష

అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా హర్షం



**అనకాపల్లి, పెన్ పవర్, మార్చి 5 :** మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా అనకాపల్లిని తీర్చిదిద్దే లక్ష్యంతో పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. 2017లో నమోదైన గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడికి 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష పడటాన్ని ఆయన స్వాగతించారు. కొత్తకోట పోలీస్ స్టేషన్ పరిధిలో 2017 మార్చి 11న ధర్మతేజ పెట్రోల్ బంక్ సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో గంజాయి అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నారు. ఈ ఘటనలో పోలీసులు సుమారు 138 కిలోల గంజాయి 6 పీవీసీ బ్యాగులు, ఒక ఇటియోస్ కారు ఏపి 31 సిఎన్ 2158 మరియు ఒక మోటార్ సైకిల్ ఏపి 31సిజె 8197 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసు విచారణ అనంతరం చోడవరం 9వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎం. హరినారాయణ నిందితుడు వర్రీ నర్సింగరావు (43) దోషి అని తేల్చి 10 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1 లక్ష జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పక్కా ఆధారాలతో చార్జ్ షీట్ దాఖలు చేసిన అప్పటి కొత్తకోట ఎస్ఐ డి. శేఖరం మరియు వారి సిబ్బందిని అభినందించారు. అలాగే ఫోరెన్సిక్ నివేదికలు, సాక్ష్యాలను సమర్థవంతంగా కోర్టులో ప్రవేశపెట్టిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సి.హెచ్. సూర్యనారాయణను మరియు కోర్టు మానిటరింగ్ సెల్ సిబ్బందిని ప్రశంసించారు.

జిల్లాలో గంజాయి సాగు, విక్రయం లేదా అక్రమ రవాణా వంటి చర్యలకు పాల్పడే వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడబోమని ఎస్పీ స్పష్టం చేశారు. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మాదక ద్రవ్యాల నియంత్రణలో ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. పాత కేసులను కూడా నిరంతరం పర్యవేక్షిస్తూ నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పోలీస్ యంత్రాంగం తెలిపింది. ఈ తీర్పు ద్వారా గంజాయి అక్రమ రవాణాకు పాల్పడే వారిలో భయం నెలకొని, జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు ఇది దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు.

## చీపురుపల్లి ఎస్సైఆధ్వర్యంలో వాహనాల తనిఖీ.



**చీపురుపల్లి పెన్ పవర్ 05.** ఈరోజు సాయంత్రం నాలుగున్నర గంటల నుంచి 6:30 గంటల వరకు రైల్వే స్టేషన్ జంక్షన్ మరియు వెదుళ్ళ వలస కొత్త రోడ్డు జంక్షన్ ల లో చీపురుపల్లి ఎస్సై దామోదర్ మరియు సిబ్బంది ఆధ్వర్యంలో నాకాబంది నిర్వహించడం జరిగింది వీటిలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి రికార్డులు లేని వెహికల్స్ ను సీజ్ చేయడం జరిగింది .అలాగే వీటిలో భాగంగా ప్రతి ఒక్కరికి రోడ్ సేఫ్టీ లో భాగంగా హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని, మద్య మద్యం సేవించి వాహనం నడపరాదని తెలియచెప్పడం జరిగింది .ఈ నాకాబందీలో అనుమానితులుగా భావించే వారి దగ్గర నుంచి 32 ఫింగర్ ప్రింట్స్ తీసుకోవడం జరిగింది. మొత్తంగా తొంబై రెండు వాహనాలను పరిశీలించడం జరిగింది. చీపురుపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొనడం చేయడం జరిగింది.

## వెదురు సంరక్షణ, వినియోగం, ఉత్పత్తులపై గ్రామసభ



**వై రామవరం పెన్ పవర్ మార్చి 5 :** వెదురు సంరక్షణ వినియోగం ఉత్పత్తులపై మండలములో చామగడ్డ పంచాయతీ దబ్బ మామిడి గ్రామంలో గురువారం గ్రామ సభ నిర్వహించడం జరిగిందని ఎంపీడీవో కే.బాపన్న దొర తెలిపారు. రంపచోడవరం సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ అధికారి ఉత్తర్వుల మేరకు దబ్బ మామిడి గ్రామంలో గ్రామస్తులతో గ్రామసభ నిర్వహించడం జరిగిందని తెలిపారు. వెదురును సంరక్షించడం, వినియోగించడం, వెదురు ఉత్పత్తులపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు.

# రైతుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి...!




వ్యవసాయ అధికారి శివరామ ప్రసాద్ వెల్లడి

**కొయ్యూరు, పెన్ పవర్ మార్చి 5:** మండలంలో ఉన్న ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి శివరామ ప్రసాద్ అన్నారు. గురువారం మండల వ్యవసాయ కార్యాలయంలో విలేజ్ అగ్రికల్చర్ అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ... ప్రభుత్వం అందించే ఎరువులు, సీడ్, పీఎం కిసాన్, యంత్ర పరికరాలు సబ్సిడీ పొందాలంటే తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఈ సందర్భంగా మండలంలో 4,000 మంది రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కావున ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోలేని రైతులు వారం రోజుల లోపు రైతు సేవ కేంద్రానికి వెళ్లి ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. అలా చేయించుకోకపోతే ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు దూరమవుతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

## కుట్టుమిషన్ శిక్షణ గృహిణులు, నిరుద్యోగ మహిళలకు సదవకాశం.






శిక్షణను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా నిలదొక్కుకోండి.

కే వీ ఐ సి ఖాదీ నోడల్ అధికారి సుబ్రహ్మణ్యం.

**స్టాఫ్ రిపోర్టర్,చింతపల్లి,గూడెం కొత్త వీధి,పెన్ పవర్,మార్చి 5:** గృహిణులు, నిరుద్యోగ మహిళలు తీసుకున్న కుట్టు మిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా నిలదొక్కు కోవాలని విశాఖపట్నం కి చెందిన కే వీ ఐ సి ఖాదీ నోడల్ అధికారి సుబ్రహ్మణ్యం అన్నారు. గత నెల 19 నుంచి లంబసింగి ఎఫ్ పీ ఓ రాజు పాకాల సమీపంలో గృహిణుల, నిరుద్యోగ మహిళలు 40 మందికి రెండు బ్యాచ్ లుగా కుట్టు మిషన్ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన కుట్టు మిషన్ శిక్షణ పొందిన గృహిణులు, నిరుద్యోగ మహిళలను శిక్షణా తరగతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. శిక్షణా తరగతుల ద్వారా నేర్చుకుని కుట్టి తెచ్చిన వస్త్రాలను తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గడచిన 15 రోజులపాటు పొందిన శిక్షణ ద్వారా మహిళలు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి బట్టలు కుట్టడం సంతోష కరమన్నారు. ఈ నైపుణ్యాన్ని మరింత మెరుగుపరుచు కోవలసిన అవసరం ఉందన్నారు. శిక్షణ పొందిన మహిళలకు త్వరలో ఉచితంగా ఒక్కొక్కరికి 25 వేల రూపాయల విలువచేసే కుట్టు మిషన్ లు అందజేయడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ కుట్టు మిషన్ లు శిక్షణ పొందిన ప్రతి మహిళ ఆ కుట్టు మిషన్ లను అమ్ముకోకుండా వాటి ద్వారా ఆర్థికంగా ఉపాధి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఖాదీ సొసైటీ అధ్యక్షులు ఐ వి రమణ, పెదబరడ మాజీ సర్పంచ్ బోయిన సత్యనారాయణ, లంబసింగి ఎఫ్ పి ఓ నిర్వాహకుడు రాజేష్, మాస్టర్ ట్రైనర్స్ రామలక్ష్మి, గణపతమ్మ, ఎఫ్ పీ ఓ సభ్యులు కూడా సరోజ (రూతు), కూడా ఇందిరా, రాహుల్, రాజు, అధిక సంఖ్యలో కుట్టుమిషన్ శిక్షకులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలలో సత్తా చాటుతాం.



- వైసిపి అధినేత, వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలవడం సంతోషంగా ఉంది.
- ఎంపీపీ అనూష దేవి, జడ్పిటిసి బాలయ్య.

**స్టాఫ్ రిపోర్టర్,చింతపల్లి/గూడెం కొత్త వీధి,పెన్ పవర్,మార్చి05:** మన్య ప్రాంతంలో వైసిపికి బలంగా ఉందని, పాడేరు నియోజకవర్గం చింతపల్లి మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలలో సత్తా చాటుతామని ఎంపీపీ కోరాబు అనూష దేవి, జడ్పిటిసి పోతురాజు బాలయ్యలు వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి విన్నవించారు. అరకు శాసనసభ్యుడు రేగం మచ్చలింగం కుమారుని వివాహ వేడుకకు విచ్చేసిన జగన్మోహన్ రెడ్డిని అరకులో బుధవారం వారు బొకే అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ మన్య ప్రాంతంలో ప్రస్తుతం నెలకొన్న బాక్సైట్, లేటరైట్ సమస్యలపై గిరిజనులలో నెలకొన్న ఆందోళనలను ఈ సందర్భంగా ఆయన దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. అదే విధంగా సమస్యల పరిష్కారానికి శాసనసభ వేదికగా కూటమి ప్రభుత్వాన్ని నిలదీయాలని కోరడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో వైసీపీ బలపరిచిన అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని, అదే క్రమంలో వైసీపీ ప్రభుత్వంలో ఇంటింటికి అందించిన సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి అర్థమయ్యే రీతిలో వివరించి 2029 సార్వత్రిక ఎన్నికలలో వైకాపా విజయానికి కృషి చేయాలని అధినేత దిశా నిర్దేశం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వివాహ కార్యక్రమానికి విచ్చేసిన ఆ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

